క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మర్రిపాలెం : జోన్ – 2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ 11 కేవీ రాజీవ్‌నగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మహత్‌కాలనీ పార్కు, వంశీనగర్, జీఐఎస్ ఏరియా, వుడా అపార్టుమెంట్స్, గంగా గోదావరి అపార్టుమెంట్స్, అప్పయ్యనగర్, మాధవధార వుడా కాలనీ, అంబేడ్కర్ కాలనీ, గాంధీనగర్, జర్నలిస్ట్ కాలనీ, జాకీర్ హుస్సేన్‌నగర్, రైవాడ పంప్‌హౌస్, సాయినగర్, మర్రిపాలెం వుడా లే అవుట్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లు


ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ అర్చకులు, భక్తులు


సీతంపేట : సీతంపేటలోని దేవదాయ శాఖ పరిధిలో గల పార్వతీశ్వరాలయంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వరకు కార్తీక మాసోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ అర్చకులు గంగవరపు శివాజీ శర్మ, భాస్కరశర్మ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీకమాసం నాలుగు సోమవారాల్లో పార్వతీశ్వరునికి గోత్రనామాలతో అభిషేకం జరపడానికి రూ.250లు, నిత్య పూజకు రూ.150 చెల్లించాలని తెలిపారు. వచ్చే నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణ మహోత్సవం నిర్వహిస్తామని, రోజూ సాయంత్రం ఆకాశ దీపారాధన, స్వామికి ప్రత్యేక హారతులిస్తామని తెలిపారు. పూజల్లో భక్తులంతా పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వీఎంఆర్‌డీఏ అటెండర్‌కు సన్మానం


రాజారావును సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేష్, అధికారులు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏలో 40 ఏళ్లపాటు అటెండర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన మామిడి రాజారావును అధికారులు ఘనంగా సన్మానించారు. బుధవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సంయుక్త కమిషనర్, కార్యదర్శి రమేష్, ఇతర అధికారులు రాజారావు దంపతులను సాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ రాజారావు 40 ఏళ్లపాటు నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారుల మన్ననలు పొందుతూ సర్వీస్ పూర్తి చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారులు నాగభూషణం, కార్తీక, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీలో సీపీ శంఖబ్రత బాగ్చి

ఏయూక్యాంపస్: పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ విశాఖ పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బుధవారం సాయంత్రం విక్టరీ ఎట్ సీ నుంచి అమరవీరుల స్మృతి స్థూపం వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవాలన్నారు. అమరవీరుల కుటుంబాలకు మనం ఎల్లవేళలా అండగా ఉండాలని కోరారు. దేశం కోసం, రాష్ట్రం కోసం, మన నగరం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటామని పతిజ్ఞ చేయించారు.


ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కుతో యువతకు వ్యక్తిత్వ వికాస తరగతులు


ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులోని గ్రంథాలయంలో పుస్తకాలు


రీడింగు రూమ్‌లో పత్రికలు చదువుతున్న వాకర్స్

పార్కుల్లో ప్రత్యేక గ్రంథాలయాలు

- మురళీనగర్‌లో పాఠకుల కోసం నిర్వహణ

మురళీనగర్ : పార్కులు కేవలం వినోదాలు, విహారానికి, విశ్రాంతికే పరిమితం కాదని... విజ్ఞాన్ని పంచే కేంద్రాలుగా తయారు చేయవచ్చుని నిరూపించారు మురళీనగర్ వాసులు. పుస్తకాలను చదవడం మానేస్తున్న ప్రస్తుత సాంకేతిక యుగంలో వాటిని సందర్శకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటికే చాలా మంది ప్రతీ చిన్న విషయానికి మొబైల్స్, కంప్యూటర్లపై ఆధార పడుతున్నారు. దీంతో పుస్తక పఠనం పట్ల ఆసక్తి సన్నగిల్లుతోంది. దీన్ని అధిగమించి ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించేందుకు మురళీనగర్‌లోని కొన్ని పార్కుల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. నగరవాసులతో రోజులో ఒక్కసారైనా పుస్తకం చేత పట్టించాలనే ఆశయంతో వీటిని నిర్వహిస్తున్నారు.

వాకర్స్, ప్రశాంతి పార్కుల్లో...

మురళీనగర్‌లో మహిళల కోసం గ్రంథాలయం ఉన్నప్పటికీ పార్కుల్లో ప్రత్యేకంగా గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. వాకర్స్ పార్కు, ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో ఈ గ్రంథాలయాలను వాకర్స్, సందర్శకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. వాకర్స్ పార్కులో కార్యాలయం గదిని గ్రంథాలయంగా రూపొందించారు. ప్రాంగణంలో ఉన్న వేదికను సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. వాకర్స్ పార్కు రూపకర్త నిమ్మగడ్డ బుచ్చయ్య (91) గత పదేళ్లుగా స్వచ్ఛంద గ్రంథాలయాధికారిగా వ్యవహరిస్తూ అన్నీ తానై చూసుకుంటున్నారు. ఇక్కడ దాతలు, వాకర్స్ క్లబ్ సభ్యులు విరాళంగా పుస్తకాలు అందించారు. పురాణ గ్రంథాలు, ఆధ్యాత్మిక, చారిత్రాత్మక పుస్తకాలు, చిన్నపిల్లలకు, పెద్దలకు ఉపయోగపడే అధ్యయన మెటీరియల్ అందుబాటులో ఉంది. వాకర్స్‌తోపాటు పార్కు సందర్శకులు ఉదయం, సాయంత్రం గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయవచ్చు. సుమారు 800 పుస్తకాలు, ఇంగ్లిష్, తెలుగు పత్రికలు అందుబాటులో ఉన్నాయి. పుస్తక పఠనం కోసం దాతల సహకారంతో ప్రత్యేకంగా పఠన కేంద్రాన్ని నిర్మించారు.

వ్యక్తిత్వ వికాస తరగతులు

ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో యువతకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తుంటారు. వివేకానంద యువ మహామండలి ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం యూత్ స్టడీ సర్కిల్ ఉంటుంది. ఇందులో యువత క్యారెక్టర్ బిల్డింగ్‌కు సంబంధించి ప్రముఖుల ప్రసంగాలు, శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పుస్తక పఠనం ఉంటుంది. హ్యూమన్ ఎక్సలెన్స్ పుస్తకాలు, వ్యక్తిత్వ వికాసానికి క్యారెక్టర్ బిల్డింగ్ పుస్తకాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు ఉన్నాయి. ఉదయం 6 గంటల నుంచి 7.30 వరకు యోగా తరగతుల అనంతరం అధ్యయనం, ప్రతి సోమవారం రామకృష్ణుడి కథామృతం, శనివారం సాయంత్రం శారదామాత వచనామృతం నిర్వహిస్తారు. బాలవిహారికి సంబంధించి బాలభారతం లాంటి కథల పుస్తకాలు పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.


వివేకానందుడి గ్రంథాలయ భవనం

వివేకానంద అధ్యయన కేంద్రం

జిల్లా వివేకానంద యువ మహామండలి పూర్వ అధ్యక్షుడు దివంగత నాయుడు లక్ష్మీనారాయణ రూ.10 లక్షలతో గ్రంథాలయాన్ని నిర్మించారు. ఇక్కడ వాచ్‌మన్ గదిని సొంత నిధులతో నిర్మించి ఉదారతను చాటుకున్నారు. ఈ కేంద్రంలో రామకృష్ణ పరమహంస, శారదామాత, స్వామి వివేకానందుడి చరిత్ర, వారి ఉపదేశాలు, స్వామి వివేకానందుడి ప్రసంగాలు, ప్రపంచ వ్యాప్తంగా ఆయన పర్యటనలు, చికాగోలో నిర్వహించిన సర్వమత సమ్మేళనంలో ప్రసంగాలు, పర్యటనలు, ఉపన్యాసాలు, భగవద్గీత, మహాభారతం, రామాయణం తదితర గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. సుమారు 600 రకాల పుస్తకాలు ఇక్కడున్నాయి. పార్కులో ఉదయం 6 గంటల నుంచి 8 వరకు, సాయంత్రం 5 నుంచి 7.30 గంటల వరకు పుస్తకాలు చదువుకోవచ్చు.


వాకర్స్ పార్కు గ్రంథాలయంలో బుచ్చయ్య, పాఠకులు

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు కోసం పోరాడండి


రైల్వేస్టేషన్ వద్ద కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, ఆటో డ్రైవర్లు

తాటిచెట్లపాలెం : ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు సాధించేందుకు పోరాడాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్ వద్ద గల విజయదుర్గా ఆటో స్టాండ్‌లో ఏఐటీయూసీ జెండాను స్టాండ్ అధ్యక్షుడు వై.వెంకట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ అక్టోబరు 31న ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో నరేంద్రమోడీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి, నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామన్నారని... మూడోసారి ప్రధాని పగ్గాలు చేపట్టిన మోడీ ఒక్క హామీనీ నెరవేర్చలేదని మండిపడ్డారు. ఉద్యోగ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు మోడీ పాల్పడుతున్నారని విమర్శించారు. ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారం మోపే జీవో నంబర్ 2131 రద్దు చేస్తామని, డీజిల్, పెట్రోల్ రేట్లు తగ్గిస్తామని, వాహనమిత్ర కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీనైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మోటార్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాగ్రాహానికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కేలం శివ, హెచ్.శేఖర్, ఎస్.సుధాకర్, పి.నరేష్, చంటి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించకుంటే చర్యలు


వాహనాలు తనిఖీ చేస్తున్న ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది

సీతమ్మధార : వాహన చోదకులంతా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు సూచించారు. బాలయ్య శాస్త్రి లే అవుట్, గురుద్వార పరిసర ప్రాంతాల్లో బుధవారం ఆయన వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహన చోదకులంతా విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లరాదని సూచించారు. బస్టాపుల వద్ద ఆటోలు పార్కింగ్ చేయొద్దని, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ ప్రమాణాలు మానుకోవాలని హితవు పలికారు. రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి వాహన చోదకులను కోర్టులో హాజరుపరుస్తున్నామని గుర్తు చేశారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని కోరారు. వాహనాలు నడుపుతూ ఫోన్‌లో మాట్లాడితే ప్రమాదాలకు గురవుతారని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సుల పుట్‌పాత్‌లపై వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుట్‌పాత్ ప్రయాణాలు ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాల్సిందే


ఆరిలోవ సబ్ స్టేషన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ నాయకు లు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఆరిలోవ సీపీఐ జోన్ ఆధ్వర్యంలో బుధ వారం ఆరిలోవ ప్రాంతంలో ర్యాలీ చేపట్టారు. ఆరిలోవ కాలనీలో చేపట్టిన ఈ ర్యాలీ హెల్త్‌సిటీలో ఉన్న ఆరిలోవ సబ్ స్టేషన్ కార్యాలయం వరకు సాగింది. అక్కడ కొంత సేపు ధర్నా చేపట్టారు.

పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం అక్కడ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జోన్ నాయకులు రెహమాన్, విమల, దేవుడమ్మ, లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం పడుతుందన్నారు. సామాన్య కుటుంబాలు, రైతులు, చిన్న వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ చార్జీలు పెరగడం వల్ల కొందరు స్వయం ఉపాధి కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

బాణసంచా దుకాణాలకు స్థల పరిశీలన


బాణసంచా ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల పోర్టు స్టేడియం సమీపాన దీపావళి బాణసంచా ఏర్పాటు చేసే ప్రాంతాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఈస్ట్ జోన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి బుధవారం పరిశీలించారు. ఇక్కడ రెండు దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ బాణసంచా వ్యాపారులు విధిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. దుకాణల మధ్య నిర్ణీత దూరం పాటించాలన్నారు. ఆయన వెంట నాలుగో పట్టణ సీఐ ఎస్.విజయకుమార్, ఎస్ఐ జి.వెంకటరావు ఉన్నారు.

డైనమిక్ లీడర్ వల్లభాయ్ పటేల్


అధికారులు, సిబ్బందితో ఐక్యతా ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ పాల్గొని అధికారులు, సిబ్బందితో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. ఇదేవిధమైన కార్యక్రమాలను డివిజన్ పరిధిలో గల అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లు, సబ్ డివిజనల్ యూనిట్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ డైనమిక్ నాయకుడని, జాతీయ ఐక్యతా, సమగ్రతపై మంచి నమ్మకమున్న వ్యక్తి అని ప్రశంసించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్ కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహూ పాల్గొన్నారు.

నాట్య కళాక్షేత్ర విద్యార్థినులకు అభినందనలు


ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులతో గురువు

సీతమ్మధార : సీతమ్మధారలోని నాట్య కళాక్షేత్ర విద్యార్థినులను పలువురు అభినందించారు. శ్రీపొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో విజయనగరంలోని మహారాజ కళాశాలలో నిర్వహించిన సర్టిఫికెట్ పరీక్షల్లో భరత నాట్య కళాకారులు పి.సాయి అక్షిత, వి.కమల శ్వేత, ఎం.ఎస్.అనన్య, పి.శ్రేష్ఠ ఉత్తీర్ణత సాధించారు. వీరిని నాట్య కళాక్షేత్ర వ్యవస్థాపకురాలు కె.మాధవి, నాట్య గురువు కె.వెంకట్ చిన్నారావు, కార్యదర్శి డి.రాజేష్, తల్లిదండ్రులు అభినందించారు.

నర్సులపై దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్

మహారాణిపేట: విధి నిర్వహణలో ఉన్న నర్సుపై రోగి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనను ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు టి.గంగాభవానీ ఖండించారు. రోగులకు సేవలందించడంలో నర్సులు కష్టపడి పని చేస్తున్నారని, రోగులు, వారి సహాయకులు నర్సులపై దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. దీనిపై అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్న నర్సులకు భద్రత కల్పించాలని కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి కోరారు.

వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


స్టాల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీసీపీ మేరీ ప్రశాంతి

మర్రిపాలెం: బాణసంచా వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘించకుండా విక్రయాలు చేపట్టాలని జోన్ – 2 డీసీపీ మేరీ ప్రశాంతి సూచించారు. ఈ మేరకు బుధవారం బిర్లా జంక్షన్ సమీపంలోని బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారివైపు, పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన దీపావళి స్టాళ్లను వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అనుమతుల పత్రాలను స్వయంగా పరిశీలించారు. నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. అందరూ సురక్షితంగా దీపావళి జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట కంచరపాలెం సీఐ చంద్రశేఖర్, ఎయిర్‌పోర్ట్ జోన్ సీఐ చక్రధర్, ఎస్ఐ సమీర్, స్టాల్ నిర్వాహకులు అంబటి శైలేష్, తదితరులు ఉన్నారు.

◆ బాణసంచా విక్రయించేందుకు ఏర్పాటు చేసిన స్టాళ్లను అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న వారి ఆధార్‌కార్డులను పరిశీలించి, ప్రతి ఒక్కరి వివరాలు రికార్డుల్లో పొందుపరచాలని నిర్వాహకులకు సూచించారు. మైనర్లను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అందరి సహకారంతో సేవా కార్యక్రమాలు


పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న నాగమల్లేశ్వరి, తదితరులు

సీతంపేట : న్యూహోప్ ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళా, సాహితీ, జర్నలిజం, సేవా రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారిని ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎం.నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఏఎంఏఎల్ హైస్కూల్ కరస్పాండెంట్ రాజాబాబు, శివరామరెడ్డి స్వీట్స్ చైర్మన్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న న్యూహోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మల్లేశ్వరి కృషిని అభినందించారు. అనంతరం మల్లేశ్వరి మాట్లాడుతూ అందరి సహకారంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. పారిశుధ్య కార్మికులు, వైద్యులు, జర్నలిస్టులను సత్కరించామన్నారు. అందరి సహకారంతో భవిష్యత్‌లో మరన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

గైస్ విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, ఇతర సిబ్బంది

మురళీనగర్ : విశాఖపట్నం ఆంధ్ర పెట్రో కెమికల్స్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థులు తమ ప్రతిభ చూపారు. ఈ కాలేజీ నుంచి పది మంది విద్యార్థులు వి.జ్ఞానేశ్వర్, ఎం.దినేశ్ కుమార్, కె.వెంకట త్రిలోచన, పి.భవానీ శంకర్, డి.రవి తేజ, ఎస్.భాగ్య కిరణ్, ఎ.రాఘవేంద్ర, ఎం.లక్ష్మీ ప్రసాద్, ఎ.తేజ, కె.బాలాజీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచి నుంచి ఐదుగురు, పెట్రో కెమికల్ నుంచి ముగ్గురు, ఆయిల్ టెక్నాలజీ బ్రాంచి, ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ బ్రాంచిల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉద్యోగాలు సాధించారు. వీరికి మొదటి సంవత్సరం రూ.2 లక్షలు, రెండో సంవత్సరం నుంచి ఏడాదికి రూ.4.80లక్షల జీతం కంపెనీ చెల్లిస్తుందని గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ఆయనతోపాటు శాఖాధిపతులు బీవీ.లక్ష్మణరావు, సీహెచ్ జయప్రకాష్ రెడ్డి, దామోదర్, ప్రశాంత కుమారి, సీహెచ్.వినోద్ కుమార్, కేబీవీఎస్ఎస్ కుమార్ అభినందించారు.

సీనియారిటీ జాబితా విడుదల చేయాలి


డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

విశాఖ విద్య: మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించి సీనియారిటీ జాబితాలను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈవో ప్రేమ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లకు ఈ నెల 28 నాటికే సీనియారిటీ జాబితాలను బహిర్గతం చేయాల్సి ఉండగా.. డీఈవో కార్యాలయ అధికారులు తీవ్ర తాత్సారం చేయడం సరికాదన్నారు. అభ్యంతరాల స్వీకరణకు తుది గడువుగా నవంబర్ 1 అని పేర్కొనడం జరిగిందని, సీనియారిటీ జాబితాలే ప్రకటించకుంటే, ఉపాధ్యాయులు వాటిని ఎలా పరిశీలించుకుంటారని ప్రశ్నించారు. సీనియారిటీ జాబితా విడుదల చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని డీఈవోను కోరారు. కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్, సీనియర్ నాయకులు బి.జనార్దన్, చినగదిలి మండల ప్రధాన కార్యదర్శి పద్మావతి, గౌరవాధ్యక్షులు ఎన్.ప్రసాద్, శేఖర్, నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆల్వార్‌దాస్ జయంతి


ఆల్వార్‌దాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రంగారావు, తదితరులు

మురళీనగర్ : వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు, విద్యావేత్త సుంకరి ఆల్వార్‌దాస్ జయంతిని మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్ - 101 గవర్నర్ టి.రంగారావు, వనిత, తదితరులు ఆల్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన పేద విద్యార్థిని చరిష్మాకు రూ.17,500లు అందించారు. పూర్వ గవర్నర్ యు.శుభ, ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల, వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎం.జయ పాల్గొన్నారు.